E-KABURU
# ఈ-కబురు
E-PAPER
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం




ఆ సీనియర్ అధికారులను తొలగించండి.. ఎయిరిండియాకు డీజీసీఏ » 2లో

(తేదీ) 22-06-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

## రేట్ల కోత ఎందుకో చెప్పిన ఆర్‌బీఐ గవర్నర్

» 4లో




## ఎనిమిదేళ్ల తర్వాత ఛాన్స్.. కట్ చేస్తే! రీఎంట్రీ మ్యాచ్‌లో డకౌట్

» 6లో



## రెండోసారి గర్భం ధాల్చిన హీరోయిన్.. నిజమేనా?

» 5లో




## బీఎస్ఎన్ఎల్ కొత్త సర్వీస్..

» 4లో




# యోగా ప్రపంచ దేశాలను కలిపింది: మోదీ



**ప్రపంచానికే స్వస్థత కేంద్రంగా భారత్**

**ఆధునిక పరిశోధనలతో యోగాను పరిపుష్టం చేస్తున్నాం**

**వైద్యం కోసం మన దేశం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు**

**స్థూలకాయం ప్రపంచానికి అతి పెద్ద సవాలు.. దాన్ని అధిగమించాలి**

**విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ**

**కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించారని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందనలు**

**మంత్రి లోకేశ్‌పై ప్రధాని ప్రత్యేక ప్రశంసలు**

ఈ కబురు: భారత్‌కు వెళ్లి స్వస్థత చేకూర్చుకో (హీల్ ఇన్ ఇండియా) అన్న భావన ఇప్పుడు ప్రపంచంలో విస్తృత ప్రాచుర్యం పొందుతోందని, అనారోగ్యంతో ఉన్నవారికి స్వస్థత చేకూర్చే అతిపెద్ద కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ పరిణామంలో యోగా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్వస్థత కోసం వచ్చేవారికి ప్రత్యేక ఈఆయుష్ వీసాలు జారీచేస్తామని ఆయన ప్రకటించారు. 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షలమందితో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని ప్రసంగించారు. ఇందులో పాల్గొనే అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తంచేశారు. విశాఖను అభివృద్ధి, రమణీయ ప్రకృతి సౌందర్యాల మేలు కలయికగా ఆయన అభివర్ణించారు. యోగా దినోత్సవాన్ని అత్యంత విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించిందని కొనియాడారు. రాష్ట్రంలో రెండు కోట్లకుపైగా ప్రజలు పాల్గొనడం... వారిలో ఉరకలెత్తే ఉత్సాహానికి నిదర్శనమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఇలాంటి స్ఫూర్తే బలమైన పునాదిగా ఆయన పేర్కొన్నారు. "పౌరులు వారంతటవారే ఓనర్‌షిప్ తీసుకుని, చురుగ్గా పాలుపంచుకుంటే ఎంత కఠినమైన లక్ష్యమైనా అసాధ్యం కాదు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆద్యంతం ప్రజల ఉత్సాహం, సుహృద్భావం ప్రబలంగా కనిపించాయి" అని మోదీ పేర్కొన్నారు. కల్లోల పరిస్థితుల్లో శాంతిమార్గం యోగా "యోగాను ఒక ప్రజా ఉద్యమంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అది ఈ ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం దిశగా నడిపిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సమతుల్యం సాధించేందుకు యోగాతో దినచర్య ప్రారంభించాలి. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం అన్న నినాదం ప్రపంచ తీర్మానం కావాలి" అని ప్రధాని ఆకాంక్షించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న అశాంతి, అస్థిరతపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కల్లోల పరిస్థితుల్లో యోగా శాంతికి మార్గం చూపిస్తుందన్నారు. "మానవ సమాజానికి యోగా ఒక 'పాజ్ బటన్'. ఒక్కసారి ఆగి ఊపిరి పీల్చుకునేందుకు, సంతులనం చేసుకునేందుకు, మళ్లీ మామూలు మనుషులయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. అంతర్గత శాంతిని ప్రపంచవిధానంగా మార్చే... 'మానవాళి 2.0 కోసం యోగా' అన్న సంకల్పానికి ఈ యోగా దినోత్సవం నాందీ ప్రస్తావనగా నిలవాలి. యోగా అనేది వ్యక్తిగత అభ్యసనానికే పరిమితం కాకూడదు, అది ప్రపంచ భాగస్వామ్యానికి ఒక మాధ్యమంగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రపంచంలోని ప్రతి దేశం తమ పబ్లిక్ పాలసీల్లో యోగాను అంతర్భాగం చేసుకోవాలని ఆయన సూచించారు.యోగాతో ఆరోగ్యం అన్న నినాదాన్ని దేశవ్యాప్తంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో జాతీయ ఆయుష్ మిషన్ కృతకృత్యమైందని మోదీ తెలిపారు. ఈ విషయంలో సాంకేతికత కీలక భూమిక పోషించిందన్నారు. యోగా పోర్టల్, యోగాంధ్ర వెబ్‌సైట్‌ల ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 10 లక్షలకుపైగా కార్యక్రమాల రిజిస్ట్రేషన్ జరిగిందని, దేశంలోని ప్రతి మూలకూ యోగా స్ఫూర్తి చేరిందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. అందరికీ అవసరమైన కొన్ని ప్రక్రియల్ని ఏర్చికూర్చి 'కామన్ యోగా ప్రొటోకాల్' పేరుతో ప్రామాణిక విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. యోగా సర్టిఫికేషన్ బోర్డు 6.5 లక్షల మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చిందని, 130 సంస్థల్ని గుర్తించిందని తెలిపారు. వైద్యకళాశాలల్లో పదిరోజుల యోగా శిక్షణ మాడ్యూల్‌ని చేర్చినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాల ద్వారా యోగా టీచర్లను సిద్ధం చేసినట్టు తెలిపారు.

**యోగాతో హృద్రోగాలు,నాడీ సమస్యలకు పరిష్కారం**

యోగాభ్యాసం వల్ల చేకూరే ప్రయోజనాల్ని ప్రపంచం నలుమూలలకూ వ్యాప్తి చేసేందుకు ఆధునిక పరిశోధనల ద్వారా యోగశాస్త్రాన్ని మరింత పరిపుష్టం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దేశంలోని ప్రముఖ వైద్య విజ్ఞానసంస్థలు యోగాపై పరిశోధనల్లో పాలుపంచుకుంటున్నాయని, ఆధునిక వైద్య విధానాల్లో యోగాకున్న ప్రాధాన్యాన్ని శాస్త్రీయంగా నిరూపించేందుకు కృషిచేస్తున్నాయని తెలిపారు. యోగా ఫలితాలకు ఆధారాలను నిరూపించడంలో దిల్లీ ఎయిమ్స్ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. హృద్రోగాలు, నాడీవ్యాధులు, మహిళల అనారోగ్య సమస్యల్ని నయం చేయడంలో, మానసిక శాంతిని చేకూర్చడంలో యోగా ప్రభావవంతంగా పనిచేస్తుందన్న విషయాన్ని ఎయిమ్స్ రుజువు చేసిందని ప్రధాని పేర్కొన్నారు.

తరువాయి 2లో

## గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**ఈ కబురు: శనివారం తెల్లవారుజామున గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఆయుష, ఆరోగ్యశాఖ ఘనంగా నిర్వహించాయి. ఈ అధికారిక కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్పోర్ట్స్ మినిస్టర్ వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు ఇతర ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే 5 వేల మంది విద్యార్థులు, యువకులు, యోగా సాధకులు ఈ యోగా డే కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని కొనియాడారు.**

తరువాయి 2లో

## భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా 8.58లక్షల దరఖాస్తులు



*భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.*

» 2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ ఎదుట మరోసారి విచారణకు హాజరైన ప్రణీత్‌రావు




*ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు మరోసారి సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు.*

» 2లో

## ఆ సమాచారాన్ని 30 లోపు ఇస్తాం.. కాళేశ్వరం కమిషన్ లేఖకు సీఎంవో రిప్లై





*ఈ కబురు,హైదరాబాద్: సీఎంవోకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ అంశాలు కావాలని కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసిన సంగతి తెలిసిందే*

» 2లో

## ఆ నీళ్లను మళ్లిస్తాం..
### పాక్ గొంతు ఎండాల్సిందే: అమిత్ షా




**పాక్‌కు వెళ్లాల్సిన నీళ్లను రాజస్థాన్‌కు మళ్లిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. దాయాది గొంతు ఎండాల్సిందేనని అన్నారు.**

ఈ కబురు: సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే" అని అమిత్ షా దుయ్యబట్టారు.

తరువాయి 2లో

## ఇజ్రాయెల్‌కు అంత సామర్థ్యం లేదు.. ట్రంప్ కీలక వ్యాఖ్యలు

ఇరాన్‌కు చెందిన ఫోర్డ్ భూగర్భ అణుకేంద్రాన్ని ధ్వంసం చేసే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

ఈ కబురు: ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెల్‌అవీవ్‌ను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సాయం లేకుండా ఫోర్డ్‌లోని భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదన్నారు. శుక్రవారం (స్థానిక కాలమానం ప్రకారం) న్యూజెర్సీలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటివరకు జరిపిన దాడుల్లో గణనీయమైన ప్రయోజనాలు సాధించిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికా సాయం లేకుండా ఇరాన్‌కు చెందిన ఫోర్డ్ భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం టెల్‌అవీవ్‌కు లేదన్నారు. ఒకవేళ వారు దాడులు చేసినా అది పెద్ద ప్రభావం చూపించవన్నారు. వారికి ఆ సామర్థ్యం లేదన్నారు. ఈసందర్భంగా తాను దౌత్యానికి కట్టుబడి ఉన్నానని చెప్పిన ఆయన.. సైనిక కార్యకలాపాలను ఆపేయాలని ఇజ్రాయెల్‌ను ఒప్పించడం ప్రస్తుతానికి అసంభవమన్నారు. ఎవరైనా గెలుస్తుంటే ఇలాంటి అభ్యర్థనలు చేయడం కష్టమని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

ఈ క్రమంలో యుద్ధంలో టెల్‌అవీవ్ అద్భుతమైన దాడులు చేస్తుండగా.. టెహ్రాన్‌వి పేలవంగా ఉన్నాయన్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య మధ్యవర్తిత్వం వహించడానికి యూరోపియన్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను ట్రంప్ తోసిపుచ్చారు. వారు సాయం చేయలేరని వ్యాఖ్యానించారు. ఇరాన్ యూరప్‌తో కాకుండా అమెరికాతో చర్చలు జరపాలనుకుంటున్నారని వెల్లడించారు.



## రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యం: హరీశ్‌రావు



**కేసీఆర్ పాలనలో అందరికీ రైతుబంధు వచ్చిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.**

**ఈ కబురు,జిన్నారం: కేసీఆర్ పాలనలో అందరికీ రైతుబంధు వచ్చిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుఅన్నారు. కాంగ్రెస్ హయాంలో ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న చాలా ఎకరాలకు రైతుభరోసా రాలేదని తెలిపారు. కేసీఆర్ పెట్టిన పథకాలకు కోతలు పెట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జిన్నారంలో భారాస ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్‌రావు, భారాస ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రైతు భరోసా రాని రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.**

తరువాయి 2లో

## ఇరాన్ కీలక అణుకేంద్రాలే లక్ష్యంగా విరుచుకుపడిన ఇజ్రాయెల్



**ఇరాన్‌లోని క్షిపణి స్థావరాలు, కీలక అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది.**

ఈ కబురు: ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనే ఏకైక లక్ష్యంతో దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్ తాజాగా దాడులను ఉద్ధృతం చేసింది. ఇరాన్‌లోని కీలక ఇస్ఫహాన్ అణు కేంద్రం లక్ష్యంగా ఇజ్రాయెల్ తాజాగా దాడులకు పాల్పడిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదకర వాయువులు లీక్ అవ్వలేదని అన్నారు. దాడులు జరిగిన ప్రదేశంలో అణ్వాయుధాల తయారీకి అవసరమయ్యే పరికరాలు, ప్రాజెక్టులు ఉన్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వైమానిక దళం.. డ్రోన్ యూనిట్ కమాండర్‌ను చంపాయని ఐడీఎఫ్ ప్రకటించింది. టెల్ అవీవ్‌పై ఇరాన్ చేసిన వందలాది డ్రోన్ దాడులకు అతడు ప్రాతినిథ్యం వహించాడని తెలిపింది. టెహ్రాన్ సహా ఇరాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. పశ్చిమ ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కాస్పియన్ సముద్రం సమీపంలోని రాస్త్ నగరంపైనా టెల్‌అవీవ్ బాంబులతో విరుచుకుపడింది. దీనికి ప్రతిగా ఇరాన్ చేస్తున్న దాడుల్లో గోలన్ హైట్స్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌లు మోగుతున్నాయి. ఇరాన్ ప్రయోగించిన అనేక డ్రోన్లను జనావాసాలు లేని ప్రాంతాల్లో కూల్చివేయడంతో ప్రజలకు ఎటువంటి హానీ జరగలేదని ఇజ్రాయెల్ తెలిపింది.

తరువాయి2లో



## ద్యుత్ ఉద్యోగులకు 2 శాతం డీఏ: భట్టి విక్రమార్క

» 2లో

ఈ-కబురు

22- 06 -2025
ఆదివారం
e-kaburu.com

మొదటి పేజి తరువాయి

# యోగా ప్రపంచ దేశాలను కలిపింది: మోదీ

**ఆ మూడూ చేస్తే ఆరోగ్యం మీ చెంత**

''స్థూలకాయం ప్రపంచానికి అతిపెద్ద సవాలు. దాన్నుంచి బయటపడేందుకు... ప్రతి ఒక్కరూ వారి రోజువారీ ఆహారంలో వంటనూనెల వినియోగాన్ని 10% తగ్గించాలి. మన దేశ ప్రజలతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్నవారంతా ఈ సవాలును స్వీకరించాలి. దీనిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. వంటనూనెల వాడకం తగ్గించడం, అనారోగ్యకర ఆహారం జోలికి వెళ్లకపోవడం, క్రమం తప్పకుండా యోగా చేయడం ఆరోగ్యకర జీవనానికి సోపానాలు'' అని ప్రధాని పేర్కొన్నారు.

**మనం అన్న భావనతోనే సంక్షేమం**

''ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా అన్న ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్‌కి విస్తృతార్థం ఉంది. ఈ భూమండలంపై ప్రతి దాని ఆరోగ్యం మరో దాంతో ముడిపడి ఉందన్న సత్యాన్ని అది బోధిస్తుంది. మనుషుల ఆరోగ్యం మనకు ఆహారాన్నందించే నేల, నీటిని అందించే నదులు, మన పర్యావరణ వ్యవస్థలో కీలకభూమిక పోషించే జంతువులు, మనకు అన్నివిధాలా మేలుచేసే మొక్కల ఆరోగ్యంపై ఆధారపడి ఉంది. యోగా అనేది మనల్ని ఈ పరస్పరాధారిత వ్యవస్థ గురించి జాగరూకుల్ని చేసి, ప్రపంచంతో ఏకత్వభావనతో ముందుకు సాగేలా మార్గదర్శనం చేస్తుంది. మొదట్లో మనం మన ఆరోగ్యం, సంక్షేమం గురించి పట్టించుకుంటాం. క్రమంగా పర్యావరణం, సమాజం, చివరకు ఈ భూమండలాన్ని రక్షించుకోవాలన్న స్పృహకు విస్తరిస్తుంది. యోగా అనేది అకుంఠితమైన వ్యక్తిగత క్రమశిక్షణకు, వ్యక్తులు నేను అన్న భావన నుంచి మనం అన్న భావన దిశగా పరిణామం చెందేందుకు దోహదం చేస్తుంది. ఇలా మారడమే నిజమైన భారతీయ ఆత్మకు ప్రతీక. 'సర్వేభవంతు సుఖిన' అంటూ భారతీయ సంస్కృతి మనకు బోధించే తత్వం సారాంశం అదే. మానవాళి సంక్షేమం కోరుకోవడం ప్రతి ఒక్కరి పవిత్ర కర్తవ్యం'' అని ఆయన తెలిపారు.

**భాయి లోకేశ్.. శభాష్**

విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్‌పై ప్రధాని ప్రశంసల వర్షం కురిపించారు. ఒకటికి రెండుసార్లు 'భాయి లోకేశ్' అని ప్రస్తావిస్తూ... యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో లోకేశ్ కృషిని ప్రశంసించారు. ''యోగా దినోత్సవం లాంటి ఒక కార్యక్రమాన్ని నిజమైన సమాజ ఉత్సవంగా ఎలా మార్చవచ్చో, సమాజంలోని ప్రతి వర్గాన్నీ ఎలా భాగస్వాముల్ని చేయవచ్చో లోకేశ్ చూపించారు'' అని కొనియాడారు. గడచిన నెలన్నర రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లోకేశ్ అలుపెరగకుండా శ్రమించారని, ఆయన కృషి అభినందనీయమని ప్రధాని కొనియాడారు. యోగా వేడుకల్లో పాల్గొనడం అద్భుత అనుభవం విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనడం అద్భుతమైన అనుభవమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ''యోగా అంటే వ్యాయామమే కాదు.. అది ఒక జీవన విధానం' అని ఎక్స్‌లో ప్రధాని పోస్టు చేశారు. విశాఖలో యోగా వేడుక వీడియోను పోస్టుకు జతచేశారు

సిడ్నీ నుంచి ఎవరెస్ట్ వరకూ ఒకటే సందేశం

''యోగా అంటేనే అనుసంధానం అని అర్థం. ప్రపంచం మొత్తాన్ని యోగా ఏకతాటిపైకి తేవడం గొప్ప విషయం. దశాబ్దం క్రితం మొదటిసారి ఐరాసలో అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి భారత్ ప్రతిపాదించినప్పుడు... స్వల్పవ్యవధిలోనే 175 దేశాలు దానికి మద్దతిచ్చాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక అంశానికి ఇంత ఐక్యతను కూడగట్టడం ఆషామాషీ కాదు. అది మన ప్రతిపాదనకు లభించిన మద్దతే కాదు... మానవాళి సంక్షేమం కోసం ప్రపంచం మొత్తం ఐక్యంగా చేసిన గొప్ప ప్రయత్నం'' అని ప్రధాని పేర్కొన్నారు. ''గడిచిన 11 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్లమంది జీవన విధానంలో యోగా అంతర్భాగమైంది. దివ్యాంగులు బ్రెయిలీ లిపి ద్వారా యోగశాస్త్రం చదువుతున్నారు. అంతరిక్షంలో శాస్త్రవేత్తలు యోగాభ్యాసం చేస్తున్నారు. గ్రామీణ యువత యోగా ఒలింపియాడ్‌లలో పాల్గొంటున్నారు. సిడ్నీ ఒపెరా హౌస్ మెట్ల నుంచి ఎవరెస్ట్ వరకు... సముద్రాల వరకూ ఒకే సందేశం వినిపిస్తోంది. ప్రతి ఒక్కరి కోసం యోగా... అందరి కోసం యోగా అన్నదే ఆ నినాదం'' అని ప్రధాని పేర్కొన్నారు.

మొదటి పేజి తరువాయి

# భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా 8.58లక్షల దరఖాస్తులు

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఇవాళ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ ఎదుట మరోసారి విచారణకు హాజరైన ప్రణీత్‌రావు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు మరోసారి సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ నెల 13, 18 తేదీల్లో కూడా ఆయన్ను సిట్ అధికారులు విచారించారు. మూడో విడతగా ఈరోజు దర్యాప్తు బృందం ప్రశ్నిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావును ఇప్పటికే సిట్ ఐదుసార్లు విచారించింది. ప్రభాకర్‌రావు ఆదేశాలనే అమలు చేశానని ఇప్పటికే ప్రణీత్‌రావు చెప్పినట్లు సమాచారం. ఆయన ఆదేశాలతోనే హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

# ఆ సమాచారాన్ని 30 లోపు ఇస్తాం.. కాళేశ్వరం కమిషన్ లేఖకు సీఎంవో రిప్లై

ఈ కబురు,హైదరాబాద్: సీఎంవోకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ అంశాలు కావాలని కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం కమిషన్ లేఖకు సీఎంవో రిప్లై ఇచ్చింది. 30వ తేదీ లోపు ఆయా శాఖలు కమిషన్ అడిగిన సమాచారాన్ని ఆయా ఇరిగేషన్ అండ్ ఫైనాన్స్ శాఖకు సీఎంవో పంపించగా.. ఎల్లుండి కేబినెట్‌లో కాళేశ్వరం కమిషన్ లేఖపై సర్కార్ చర్చించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం లోపాలు బయటపడ్డాయి. ఈ మూడు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. దీంతో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, మాజీ మంత్రులకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. కమిషన్ గడువు వచ్చే నెలాఖరుతో ముగియనుండగా, ఆ లోగానే ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

ఇస్తాయని సీఎంవో తెలిపింది. కమిషన్ అడిగిన సమాచారా

## ద్యుత్ ఉద్యోగులకు 2 శాతం డీఏ: భట్టి విక్రమార్క

విద్యుత్ ఉద్యోగులకు 2 శాతం డీఏ ఇచ్చామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు 2 శాతం డీఏ ఇచ్చామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి పెంచిన డీఏ అమల్లోకి వస్తుందని చెప్పారు. దీంతో 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో దేశానికి తెలంగాణ దిక్సూచి కావాలని పేర్కొన్నారు.

మొదటి పేజి తరువాయి

## ఆ నీళ్లను మళ్లిస్తాం.. పాక్ గొంతు ఎండాల్సిందే: అమిత్ షా

1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు..!

మహిళా రిజర్వేషన్లతోనే 2029 ఎన్నికలు..

ఈసందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. ''నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డీఎంకే.. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది'' అని హోంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

## ఆ సీనియర్ అధికారులను తొలగించండి.. ఎయిరిండియాకు డీజీసీఏ ఆదేశం!

ఈ కబురు,గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787 8 డ్రీమ్‌లైనర్ ఇటీవల కుప్పకూలి మంటల్లో దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలోనే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎయిరిండియాలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అధికారులను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ ముగ్గురు అధికారులు సిబ్బంది షెడ్యూల్, రోస్టర్ విధులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ''నిబంధనలు సరిగా పాటించకపోవడం వల్లే వారిపై చర్యలకు డీజీసీఏ ఉపక్రమించింది. లైసెన్సింగ్, సర్వీసింగ్ లోపాలు ఉన్నా ఎయిరిండియా విమాన సిబ్బందిని షెడ్యూల్ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎయిర్‌లైన్స్ వెల్లడించిన విషయాల ఆధారంగా అలసత్వంగా వ్యవహరించిన అధికారులపై వేటు వేయాలని సిఫార్సు చేసింది. నిబంధనలు పాటించకుండానే షెడ్యూల్ చేశారు. అంతేకాకుండా, వారు ఈ తప్పిదాలపై జవాబుదారీతనంతో వ్యవహరించలేదు. ఎలాంటి జాప్యం చేయకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీసీఏ పేర్కొంది. వెంటనే వారిపై అంతర్గత క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది. ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యలను 10 రోజులలోపు డీజీసీఏకి నివేదించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది'' అని వెల్లడించాయి. అంతేకాకుండా వీరి స్థానంలో కొత్త అధికారులను నియమించాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు కొత్త వారినే కొనసాగించాలని తెలిపింది. బెంగళూరు నుంచి లండన్‌కు బయలుదేరిన రెండు విమానాల సమయ పరిమితి 10 గంటలు ఆలస్యంగా చేరుకొన్నాయి. దీనిపై డీజీసీఏ ఎయిర్‌లైన్స్ ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీటికి సమాధానం చెప్పాలని ఏడు రోజుల గడువు విధించింది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన కొన్ని సెకన్లలోనే ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైంది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది ఓ భవనంపై కూలిపోయింది. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు విమానం కూలినచోట మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంలో ఉన్న వైద్య విద్యార్థులు, పలువురు స్థానికులు కూడా కన్నుమూశారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 272 మంది. మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి, వారి కుటుంబీకులకు అందజేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే డీజీసీఏ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ ముగ్గురు అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు..
# బేడీల రాజ్యం: హరీశ్‌రావు

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండు రైతుభరోసా నిధులు సీఎం ఇవ్వలేదని చెప్పారు. కరోనా వచ్చినా భారాస హయాంలో రైతుబంధు ఇచ్చారని పేర్కొన్నారు. రైతులకు బేడీలు వేసి జైలులో పెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యమని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్‌రెడ్డి తనపై కేసు పెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ పడిపోయిందని వ్యాఖ్యానించారు.

## ఇరాన్ కీలక అణుకేంద్రాలే లక్ష్యంగా విరుచుకుపడిన ఇజ్రాయెల్

శుక్రవారం ఐడీఎఫ్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ పాలనను అస్థిరపరచడానికి దాడులను మరింత తీవ్రతరం చేయాలని సూచించారు. ఇరాన్ ప్రభుత్వ కేంద్రాలు, సంస్థలు, మౌలిక సదుపాయాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకోవాలన్నారు. టెహ్రాన్‌లోని శక్తిమంతమైన బాసిజ్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వంటి కేంద్రాలను ధ్వంసం చేయాలని సూచించారు. మరోవైపు ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి తీసుకోవాల్సిన దౌత్యపరమైన నిర్ణయాలపై చర్చలు జరిపేందుకు యూరోపియన్ విదేశాంగ మంత్రులు ఇప్పటికే ఇరాన్ విదేశాంగ శాఖతో చర్చలు జరుపుతున్నారు.

మొదటి పేజి తరువాయి

## భారత్‌తో దీర్ఘకాలిక ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం: పుతిన్

ఈ కబురు: భారత్ తో తాము దీర్ఘకాలికంగా కొనసాగిస్తున్న ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు కృషి చేస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. ఇండియారష్యా బిజినెస్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ.. 2030 వరకు దీర్ఘకాలిక సహకారం కోసం మాస్కో కార్యాచరణ ప్రణాళికను త్వరలో ఖరారు చేస్తామన్నారు. చమురు, గ్యాస్ ఎగుమతులు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. దీనిని ముందుకు తీసుకువెళ్లడానికి తమ భాగస్వాములకు వాణిజ్య అడ్డంకులను తొలగిస్తూ కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్నామని వెల్లడించారు. పెట్టుబడి సహకారాన్ని మరింత పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. భారత్‌తో సహా పలు ముఖ్య భాగస్వాములతో దీర్ఘకాలిక సహకార ప్రణాళికలను సిద్ధం చేయడానికి రష్యా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భారత్‌రష్యా బిజినెస్ ఫోరమ్‌లో భారత్ తరఫున కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పాల్గొన్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే సెషన్‌లో మంత్రి మాట్లాడుతూ.. భారత్‌లో కృత్రిమ మేధ పురోగతిని, సమ్మిళిత సాంకేతిక వృద్ధిలో దాని పాత్రను వివరించారు. భారత్‌రష్యాల మధ్య లోతైన ఆర్థిక సంబంధాలు, సహకారం కోసం మరిన్ని కొత్త మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రష్యన్ ఫెడరల్ మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులు, పెట్టుబడిదారులతో అశ్విని వైష్ణవ్ సమావేశమయ్యారు. రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైల్వే ఆధునికీకరణ, సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి కీలక రంగాలలో భారతదేశంరష్యా సహకారాన్ని మరింత ముందుకుతీసుకెళ్లడంపై వారి మధ్య చర్చలు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సాంకేతికత ఆధారిత, మౌలిక సదుపాయాల రంగాలలో రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను పెంపొందించడానికి భారత్ నిబద్ధతతో ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం పత్రికా ప్రకటనలో తెలిపింది.



## 'ఓజాస్ తేజో' ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, జూన్ 21 : 'ఓజస్ తేజో యోగా' ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ డిడి కాలనీ లైబ్రరీ హాల్‌లో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ (21జూన్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ యోగా దినోత్సవ కార్యక్రమంలో కాలనీ వాసులు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వివిధ యెగాసనాలను ప్రదర్శించారు. డిడి కాలనీ లైబ్రరీ హాల్ మొత్తం యోగా సాధకులతో నిండిపోయింది. ఈ సందర్భంగా 'ఓజాస్ తేజో యోగా' ఇనిస్టిట్యూట్ నిర్వహకురాలు, యోగా గురువు వర్ష దేశ్‌పాండే మాట్లాడుతూ.. అందరికి 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యోగా యెక్క విశిష్టతను, తమ దైనందిన జీవితంలో దాని ప్రాముఖ్యతను వివరించారు. యోగా శారీరక, మానసిక, ఆరోగ్యంపై చూపే సానుకూల ప్రభావాన్ని నొక్కి చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయడానికి రోజులో కొంత సమయం కేటాయించాలని తెలిపారు. ప్రస్తుత నగరజీవనంలో మహిళలందరికీ రోజువారీ యోగా సాధన ఆవశ్యకతను వివరించారు. అనంతరం పలు యోగాసనాలు వేసి అందరిలో స్ఫూర్తి నింపారు. అలాగే పలువురు వక్తలు మాట్లాడుతూ.. రోజువారీ యోగా చేయడంలో వారి అనుభవాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యోగా విద్యార్థులతో పాటు పలువురు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓజస్ తేజో యోగా ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు వర్ష దేశ్‌పాండేకి శాలువా కప్పి సత్కరించారు.





## గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ప్రపంచానికి ఈ వరాన్ని అందించిన గురువు, మహర్షి పతంజలి గారిని ఈ సందర్భంగా మనందరం స్మరించుకోవాలని అన్నారు. ఆయన అందించిన అష్టాంగ యోగ విద్యలే, నేటి యోగాకు ప్రాణాధారమని, యోగా అనేది కేవలం వ్యాయామానికి సంబంధించినది కాదని శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే అద్భుతమైన సాధనమని మంత్రి తెలిపారు. అలాగే ప్రస్తుతమున్న ఉరుకుల పరుగుల జీవన శైలితో బీపీ, షుగర్, కేన్సర్లు, కిడ్నీ సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, కోట్లు సంపాదించే వారికి కూడా ప్రశాంతత ఉండడం లేదని, ఇటువంటి సమస్యలన్నింటికీ యోగా చక్కని పరిష్కార మార్గం చూపుతుందని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అలాగే యోగాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 630 మంది యోగా గురువులను నియమించడం జరిగిందని, మరో 264 మంది యోగా గురువుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. హెల్త్ సబ్‌సెంటర్లలో రోజూ ఉదయం యోగా క్లాసులు నిర్వహిస్తున్నామని. గత ఏడాది కాలంలో కొత్తగా 5 లక్షల మందికి యోగా నేర్పించామని, అన్ని విద్యా సంస్థల్లో యోగా నేర్పించేలా ప్రోత్సహిస్తున్నామని, నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో పీజీ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగాను చేరువ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహా హామీ ఇచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ లో యోగా డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ యోగా డే వేడుకల్లో మంత్రి పొన్నం తో పాటుగా.. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఇతర అధికారులు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# దరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టులో మరో ముందడుగు



**హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వం మెట్రో రైలు దశ 2 (బి) ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. మెట్రో రైల్ ఫేజ్ 2 (బి) ప్రతిపాదనతో పాటు అవసరమైన అన్ని పత్రాలు, డీపీఆర్‌లను ఇవాళ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. వారం క్రితం రెండో దశ మెట్రో ప్రాజెక్టుకు తెలంగాణ సర్కార్.. పరిపాలన అనుమతులు ఇచ్చింది. మెట్రో రెండో దశ (బి) లో 86.1 కిలోమీటర్లు. 19,579 కోట్ల రూపాయలతో మెట్రో రెండో దశ నిర్మాణం జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యం తో మెట్రో రెండో దశ నిర్మాణం జరగనుంది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టులో 3 కారిడార్లు ఉన్నాయి. అందులో ఆర్‌జీఐఏ నుండి భారత్ ఫ్యూచర్ సిటీ (39.6 కిమీ; రూ.7,168 కోట్లు), జేబీఎస్ నుంచి మేడ్చల్ (24.5 కిమీ; రూ. 6,946 కోట్లు), జేబీఎస్ నుంచి షామిర్‌పేట (22 కిమీ; రూ. 5,465 కోట్లు). మొత్తం 86.1 కిమీ పొడవును కవర్ చేసే ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టులో మొత్తం రూ. 19,579 కోట్ల పెట్టుబడి ఉంటుంది.**

**గతంలో సమర్పించిన ఫ్లేజ్ 2 (ఎ) ప్రాజెక్ట్ ఐదు కారిడార్ల (76.4 కి.మీ) లాగానే, ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్ట్‌ను కూడా కేంద్ర, రాష్ట ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వ JV ప్రాజెక్ట్ నిబంధనల ప్రకారం, ఫేజ్ 2 (బి) ఖర్చు రూ.19,579 కోట్లు. తెలంగాణ ప్రభుత్వ వాటా రూ. 5,874 కోట్లు (30 శాతం), భారత ప్రభుత్వం వాటా రూ. 3,524 కోట్లు (18 శాతం), అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణం రూ. 9,398 కోట్లు (48 శాతం), చిన్న పీపీపీ భాగం రూ. 783 కోట్లు (4 శాతం) కలిగి ఉంటుంది.**

# మియాపూర్ సెయింట్ మార్టిన్స్ స్కూల్ లో యోగా డే వేడుకలు



యోగా విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## యోగాసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను మియాపూర్ సెయింట్ మార్టిన్స్ స్కూల్ లో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. శనివారం స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెయింట్ మార్టిన్స్ స్కూల్ విద్యార్థులు ఉత్సహంగా పాల్గొని పలు యోగా ఆసనాలు వేయడంతో పాటు యోగా విన్యాసాలతో ఆకట్టుకున్నారు. యోగా టీచర్లు హాజరై విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ మార్టిన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని విద్యార్థులకు యోగాతో కలిగే ఉపయోగాలను తెలిపారు. యోగా భారతీయ సంప్రదాయం నుంచి వచ్చిన అమూల్య బహుమతి అని, యోగాను విశ్వవ్యాప్తం చేసే ఉద్దేశంతో భారత ప్రధాని నరేంద్ర మోదీ 2014, సెప్టెంబరు 27న ఐక్యరాజ్య సమితి (ఐరాస) జనరల్ అసెంబ్లీలో ఏటా జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరపాలని ప్రతిపాదించారన్నారు. దీంతో 2015 నుంచి ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచ వ్యాప్తంగా యోగా డే నిర్వహిస్తున్నారని అన్నారు. యోగా, వ్యాయామం శారీరక, మానసిక శ్రేయస్సుకు గణనీయమైన ప్రయోజనాలను చూపుతుందని తెలిపారు. విద్యార్థులు తమ చిన్నతనం నుంచే యోగాను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సెయింట్ మార్టిన్ యోగా డే వేడుకల్లో విద్యార్థులు



స్కూల్ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శినితో ఎన్ సీసీ స్టూడెంట్స్

## పిజెఆర్ స్టేడియంలో ఘనంగా యోగా దినోత్సవం



యోగా దినోత్సవంలో శిక్షకులను సన్మానిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న యోగా విన్యాసాలు



ఆకట్టుకున్న యోగా విన్యాసాలు

### యోగా విన్యాసాలతో ఆకట్టుకున్న చిన్నారులు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : చందానగర్ లోని పిజెఆర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పతాంజలి యోగ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో యోగ అభ్యాసకులు పాల్గొని యోగ ప్రోటోకాల్ ను పాటించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు పుట్ట వినయకుమార్ గౌడ్, తరిగొప్పల స్వేత, జగన్నాథం, బోనకుర్తి విఠల్ లను అభ్యాసకులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగ అంటే వ్యాయామ ప్రక్రియ మాత్రమే కాదని అదొక జీవన విదానమని అన్నారు. ప్రాపంచిక ఆందోళనలను తగ్గించి మనిషికి ప్రశాంతతను ప్రసాదించే దివ్య ఔషదం యోగ అని అన్నారు. మనిషి ఆయుష్షు ను పెంచే సాధన ఏదైన ఉందంటే అది యోగా మాత్రమేనని తెలిపారు. అనారోగ్యాల బారిన పడకుండా ముందే అప్రమత్తం అవ్వాలని, అందుకు నిత్యం యోగానే శరణ్యమని అన్నారు. ఈ నేపథ్యంలో పలువురు చిన్నారులు యోగా విన్యాసలతో ఆకట్టుకున్నారు.

## గచ్చిబౌలి గోల్డ్ క్రెస్ట్ స్కూల్ లో ఉత్సహంగా యోగా దినోత్సవం

### యోగాసనాలు చేసిన విద్యార్థులు

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని టీఎన్జీవో కాలనీలో గల గోల్డ్ క్రెస్ట్ స్కూల్ లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఉత్సహంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాద్యాయులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు చేశారు."సామరస్యం మరియు శాంతి కోసం యోగా" అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో మార్గదర్శక యోగా సెషన్‌లు, శ్వాస వ్యాయామాలు, ధ్యానం చేశారు. ఆరోగ్యకరమైన మనస్సు, శరీరం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుంటూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ వ్యవస్థాపకులు సునైనా ప్రకాష్, కిరణ్ కుమార్ బూసానిలు ఈ వేడుకల్లో పాల్గొని యోగా విశిష్టతను వివరించారు. పాఠశాల యోగాను జీవన విధానంగా మరియు దాని సమగ్ర విద్యా విధానంలో కీలకమైన భాగంగా చేర్చాలని అన్నారు.





యోగా ఆసనాలు చేస్తున్న గోల్డ్ క్రెస్ట్ విద్యార్థులు

## యోగా డే ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం

### గచ్చిబౌలి స్టేడియం టిఫిన్ స్టాల్ వద్ద తొక్కిసలాట

### అన్వస్థకు గురైన నర్సింగ్ విద్యార్థిని

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. యోగా దినోత్సవ వేడుకల కోసం భారీ ఎత్తున జన సమీకరణ చేపట్టిన అధికారులు వచ్చిన వారికి కనీస వసతుల ఏర్పాట్లను మాత్రం గాలికి వదిలేసారు. ముఖ్యంగా యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కళాశాలలు,పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఆధీనంలోని సంస్థల సభ్యులను తీసుకువచ్చారు. యోగా అనంతరం మంచినీరు, అల్పాహారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీని కారణంగా గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన టిఫిన్స్ కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో ఓ నర్సింగ్ విద్యార్థి కింద పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే గాయపడిన నర్సింగ్ విద్యార్థిని ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు ప్రమాదం లేదని తేల్చారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. యోగా అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. అప్పటికే పలువురికి టోకెన్లు జారీ చేయగా టోకెన్లు ఉన్నవారు టిఫిన్ కోసం వెళ్లగా టిఫిన్ కేంద్రం వద్ద అల్పాహారం అయిపోయింది. దీంతో మరోసారి ట్రాలీ ఆటోలో టిఫిన్ తెప్పించగా, టోకెన్లు ఉన్నవారు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీని కారణంగా తోపులాట చోటుచేసుకుంది. గాంధీ ఆస్పత్రిలో నర్సింగ్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న నజిమా(19) ఈ తోపులాటలో కింద పడిపోయింది. టిషన్ కోసం ఎగబడిన వారు కిందపడిన నజిమాను మెడ, కడుపు పై తొక్కడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే ఆంబూలెన్స్ లో కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి ఆమెను పరామర్శించి ఆరోగ్యం విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బంది ఉండదని వారు పేర్కొన్నారు. ఓ డ్యూటీ డాక్టర్ తో పాటు అంబూలెన్స్ లో ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించామని, అక్కడ సీటీ స్కాన్ చేస్తే ఏదైనా ఇబ్బంది ఉంటె తెలిసే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారు. సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట చోటుచేసుకుందని పలువురు విమర్శించారు.



అస్వస్థతకు గురైన విద్యార్థిని పరామర్శిస్తున్న అజయ్ కుమార్,



## గచ్చిబౌలి డివిజన్ లో రూ.9.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### గచ్చిబౌలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయం : ఎమ్మెల్యే, కార్పొరేటర్

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ భారీ నిధులతో నూతన అభివృద్ధి కార్యక్రమాలకు బీజం వేశారు. డివిజన్ పరిధిలో 9.10 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న మంచినీటి పైప్ లైన్ పనులకు, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు శనివారం తెలంగాణ పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. నల్లగండ్ల హుడా కాలనీ సాయి గ్రీన్ మెడోస్ లో 24.50 లక్షలతో మంచినీటి పైప్ లైన్ పనులకు, ఎపిస్టెమో స్కూల్ సర్కిల్ నుండి రామ్‌కీ ఆర్బిట్ గేట్ వరకు 8.50 కోట్లతో బిటి రోడ్డు, రాంకీ కాస్మోస్ నుంచి నవోదయ కాలనీ వరకు 36 లక్షలతో భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పూర్తిస్థాయి అభివృద్ధి తన ధ్యేయమన్నారు. నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా ప్రజల్లో నిత్యం మమేకమై, బస్తీ వారీగా సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనేక అభివృద్ధి పనులను విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. వీటిలో మంచినీటి పైప్ లైన్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, ఫ్లై ఓవర్లు నిర్మాణం, పాత పైప్ లైన్ల పునఃనిర్మాణం, పార్కుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. సమస్యలను ఒక్కొకటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఆదర్శవంతమైన గచ్చిబౌలి డివిజన్ ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో గచ్చిబౌలి డివిజన్ ను అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ అభిషేక్ రెడ్డి,డీఈ విశాలాక్షి, ఏఈ రషీద్, హెచ్ఎండిఏ ఎస్ఈ అప్పా రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వినయ్ దత్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్. నితీష్ రెడ్డిలతో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు



స్థానికులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

## ప్రొఫెసర్ జయశంకర్ సేవలను తెలంగాణ జాతి మర్చిపోదు : కొమిరిశెట్టి సాయిబాబా



కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

### ఖాజాగూడలో జయశంకర్ వర్ధంతి

ఈ-కబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన పోరాటాలను, తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం చేసిన సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా శనివారం సాయిబాబా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన నివాళులు అర్పించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ప్రజా సేవలో నిమగ్నమవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంతం ఆంధ్ర పాలకుల కారణంగా అణగారిపోయి అభివృద్ధికి నోచుకోకుండా ఉందని గుర్తించి తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రత్యేక రాష్ట్ర కాంక్షను రగిలించిన ఘనత జయశంకర్ దని అన్నారు. తెలంగాణ ఉద్యమ కర్త కెసిఆర్ తో వెన్నంటి ఉండి తెలంగాణ ప్రాంతంలో మన నీళ్లు,మన నిధులు,మన ఉద్యోగాలు కావాలని, కోరుకునే వ్యక్తులలో మొదటి వ్యక్తి జయశంకర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజమ్మ, మాధవి, దార్గుపల్లి నరేష్, నారాయణ, రమేష్ గౌడ్, నరేష్ సింగ్, అలీం, తాహెర్, బురాన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ కు నివాళులర్పిస్తున్న సా యిబాబా




# ఈ వారం ఐపీవోల్లో ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ, ఇతర కంపెనీలు

ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 700-740 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 25న ప్రారంభంకానున్న ఇష్యూ 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10,000 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది.

ఇష్యూ ద్వారా రూ. 12,500 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 20 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. అనుబంధ సంస్థ విలువను రూ. 61,400 కోట్లుగా బ్యాంక్ మదింపు చేసింది.

కాగా.. ఈక్విటీ జారీ నిధులను టైర్-1 మూలధన పటిష్టతకు హెచ్‌డీబీ కేటాయించనుంది. తద్వారా బిజినెస్ వృద్ధికి వీలుగా రుణాల విడుదల తదితర భవిష్యత్ పెట్టుబడి అవసరాలకు వినియోగించనుంది. జులై 2న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ కావచ్చు.

**సంభవ్ స్టీల్ ట్యూబ్స్**

ఎలక్ట్రిక్ రెసిస్టెన్స్ వెల్డెడ్(ఈఆర్‌డబ్ల్యూ) స్టీల్ పైపుల తయారీ కంపెనీ సంభవ్ స్టీల్ ట్యూబ్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 25న ప్రారంభంకానుంది. 27న ముగియనున్న ఇష్యూకి రూ. 77-82 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 440 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు.

ఇష్యూ ద్వారా మొత్తం రూ. 540 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. ఈక్విటీ జారీ నిధుల రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. దేశీయంగా ఈఆర్‌డబ్ల్యూ స్టీల్ పైపులు, స్ట్రక్చరల్ ట్యూబుల(హాలో సెక్షన్) తయారీలోని కీలక కంపెనీలలో ఒకటిగా సంభవ్ స్టీల్ నిలుస్తోంది.

**ఐకాన్ ఫెసిలిటేటర్స్**

చిన్న, మధ్యతరహా కంపెనీ(ఎస్ఎంఈ).. ఐకాన్ ఫెసిలిటేటర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 85-91 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 24న ప్రారంభమై 26న ముగియనుంది. ఐపీవోలో భాగంగా 21 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా టెక్నికల్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసులందించే కంపెనీ రూ. 19.1 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కంపెనీ లిస్ట్ కానుంది.

ఐపీవో నిధుల్లో రూ. 16 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఎలక్ట్రికల్, క్యాప్టివ్ పవర్, బిల్డింగ్ మేనేజ్‌మెంట్‌తో పాటు వాటర్ ట్రీట్‌మెంట్ సర్వీసులు సమకూర్చుతోంది. అంతేకాకుండా ఫైర్ అండ్ సేఫ్టీ పరికరాలు, ఎలివేటర్లు, ఎస్కలేటర్ల నిర్వహణను సైతం చేపడుతోంది. 2025 మార్చి 31కల్లా కంపెనీ 2,000 మందికిపైగా ఆయా విభాగాలలో నిపుణులైన ఉద్యోగులను కలిగి ఉంది.



# ఓపెన్ ప్లాట్లకూ రుణాలు!

సాధారణంగా అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లాలు వంటి నిర్మాణ సంబంధమైన ప్రాపర్టీలకు బ్యాంక్‌లు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)లు గృహ రుణాలు ఇస్తుంటాయి. ఓపెన్ ప్లాట్లు, స్థలాల కొనుగోళ్లకు రుణాల మంజూరు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంటాయి. పలు థర్డ్ పార్టీ ఏజెన్సీలు ఓపెన్ ప్లాట్లకు సైతం రుణాలను మంజూరు చేపిస్తున్నాయి. ఓపెన్ ప్లాట్ల మార్కెట్ బాగుండి, మంచి అనుభవం ఉన్న డెవలపర్లకు ఫండింగ్ చేస్తుంటారు. ప్లాటింగ్ వెంచర్‌లో నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుంది. స్థలం కొన్న తర్వాత రోడ్లు, లైటింగ్, ఎలక్ట్రిసిటీ వంటి ఖర్చులకు మినహా పెద్దగా వ్యయం కాదు. అందుకే స్థలం కొనేందుకు కూడా లోన్లను ఇస్తుంటారు.

**నాలుగు గోడలకు కాలం చెల్లింది..**

బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల నిధుల కొరతతో రియల్టీ ప్రాజెక్ట్‌లకు రుణాలు అంత ఈజీగా దొరకడం లేదు. కొత్త ప్రాజెక్ట్‌లకు లోన్స్ సంగతి దేవుడెరుగు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లకూ ఫండింగ్ దొరకటం కష్టంగా మారింది. నాలుగు గోడల ఇంటికి కాలం చెల్లింది. కాంక్రీట్ భవనాలకు కొనుగోలుదారులు స్వస్తి పలికేశారు. సాంకేతికతను వినియోగించే టెకీ భవనాలు, ఆధునిక వసతులుండే విలాస గృహాలకు జై కొడుతున్నారు. సౌర విద్యుత్, హోమ్ ఆటోమేషన్, ఎస్‌టీపీ, రెయిన్ హార్వెస్టింగ్ వంటి ఏర్పాట్లు ఉన్న గృహాల కొనుగోళ్లకే మద్దతు పలుకున్నారు. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు ఇద్దరూ ఈ తరహా ప్రాజెక్ట్‌ల పెట్టుబడులకే మొగ్గుచూపుతున్నారు. అందుకే డెవలపర్లు కూడా ఇలాంటి ప్రాజెక్ట్‌ల నిర్మాణాలనే చేపట్టాలి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి రుణాలు, ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు వస్తాయి.




## వచ్చే నెలలో టెస్లా షోరూమ్ ఓపెన్

ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని టెస్లా కంపెనీ కార్లను భారత్‌లో విక్రయించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వచ్చే నెలలోనే ముంబయిలో షోరూమ్ ప్రారంభించనున్నట్లు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. యూరప్, చైనా వ్యాప్తంగా ఈ కార్ల అమ్మకాలు ఇటీవల క్షీణించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, మస్క్ మధ్య ఇటీవల జరిగిన మాటల యుద్ధం నేపథ్యంలో టెస్లా షేర్లు మరింత దిగజారాయి.

ట్రంప్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించనున్నారని తెలిసిన క్షణం నుంచి కొంత కాలంపాటు టెస్లా అమ్మకాలు జోరందుకున్నాయి. అయితే ఇటీవల ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదరడంతో అమ్మకాలు డీలా పడ్డాయి. దాంతోపాటు చైనాలోనూ టారిఫ్ భయాలతో టెస్లా అమ్మకాలు పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో మస్క్‌కు భారత్ భారీ మార్కెట్‌గా తోస్తుంది. ఇప్పటికే దేశంలో టెస్లా అమ్మకాలు ప్రారంభిస్తామని కంపెనీ ప్రకటించింది.

యూరప్, చైనాల్లో అమ్మకాలు క్షీణించిన నేపథ్యంలో టెస్లా ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్ అయిన భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరించడానికి ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా టెస్లా వచ్చే నెలలో ముంబయిలో తన మొదటి షోరూమ్‌ను ప్రారంభించనుందని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ముంబయిలో షోరూమ్ ప్రారంభించిన కొద్ది రోజులకు ఢిల్లీలో షోరూమ్ ఓపెన్ చేస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే టెస్లా కంపెనీ అమెరికా, చైనా, నెదర్లాండ్స్ నుంచి సూపర్ ఛార్జర్ కాంపోనెంట్స్, కార్ యాక్సెసరీస్, మర్కండైజ్, విడిభాగాలను దిగుమతి చేసుకుందని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.

టెస్లా చైనా ఫ్యాక్టరీ నుంచి మోడల్ వై రేర్ వీల్‌డ్రైవ్ ఎస్‌యూవీలు భారతదేశానికి చేరుకున్నాయని ఈ విషయం తెలిసిన వ్యక్తులు బ్లూమ్‌బర్గ్‌కు తెలిపారు. మోడల్ వై ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న ఎలక్ట్రిక్ కారు. ఎలాన్ మస్క్ ఫిబ్రవరిలో అమెరికాలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన తర్వాత టెస్లాను భారతదేశానికి తీసుకురావడంలో పురోగతి వచ్చింది. గతంలో దేశీయ టారిఫ్‌లు, స్థానిక తయారీపై మస్క్ విభేదించడంతో భారత్‌లో కంపెనీ ప్రవేశంపై ఏళ్ల తరబడి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడినట్లయింది.



## రేట్ల కోత ఎందుకో చెప్పిన ఆర్‌బీఐ గవర్నర్

**వృద్ధికి మద్దతుగానే రేట్ల తగ్గింపు..**
**స్పష్టమైన సంకేతం ఇవ్వాలన్నదే ఉద్దేశం**
**ఆర్‌బీఐ గవర్నర్ ఎంపీసీ సమావేశం వివరాల వెల్లడి**

అంతర్జాతీయంగా ఉద్రిక్తతల నడుమ సెంట్రల్ బ్యాంక్ వృద్ధికి మద్దతుగా నిలుస్తుందన్న స్పష్టమైన సంకేతం ఇవ్వడానికే వడ్డీ రేట్ల కోత నిర్ణయాన్ని తీసుకున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంయ్ మల్హోత్రా తెలిపారు. లిక్విడిటీ పరంగా స్పష్టతకు, వినియోగం, పెట్టుబడులకు ఊతమిచ్చేందుకు వీలుగా రుణ వ్యయాలను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ఉద్దేశ్యాలుగా పేర్కొన్నారు.

ఆర్‌బీఐ గవర్నర్ అధ్యక్షతన గల ఆరుగురు సభ్యుల ఎంపీసీ ప్యానెల్ ఈ నెలారంభంలో రెపో, రివర్స్ రెపో రేట్ల కోత నిర్ణయాలు ప్రకటించడం తెలిసిందే. ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన ఎంపీసీ సమావేశంలో చర్చించి, రికార్డు అయిన వివరాలు (మినిట్స్) విడుదలయ్యాయి. ఐదుగురు సభ్యులు 50 బేసిస్ పాయింట్ల మేర రేట్ల కోతకు అనుకూలంగా ఓటు వేశారు. సౌగత భట్టాచార్య మాత్రం 25 బేసిస్ పాయింట్లకు మొగ్గు చూపించారు.

గత కొన్ని నెలల కాలంలో ద్రవ్యోల్బణం 3 శాతం మేర తగ్గడం (2024 అక్టోబర్‌లో నమోదైన 6.2 శాతం నుంచి 2025 ఏప్రిల్ నెలలో 3.2 శాతానికి), వార్షికంగా ద్రవ్యోల్బణం 3.7 శాతానికి పరిమితం అవుతుందన్న అంచనాల నేపథ్యంలో 50 బేసిస్ పాయింట్లకు అనుకూలంగా గవర్నర్ మల్హోత్రా మొగ్గు చూపించారు.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అస్థిరమైన రేట్ల కోత కంటే.. 50 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించడం విధానపరమైన స్పష్టతకు, వేగవంతమైన బదిలీకి వీలు కల్పిస్తుందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ గుప్తా అభిప్రాయపడ్డారు. తటస్థ విధానానికి సైతం మద్దతు పలికారు.




## అదే జరిగితే పెట్రోల్, డీజిల్ రేట్లకు రెక్కలే!

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో ముడిచమురు రేట్లు భగ్గుమన్నాయి. యుద్ధం మొదలైన గత శుక్రవారం నాడు (జూన్ 13న) ఒకే రోజున ఏకంగా 11 శాతం ఎగిసింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ రేటు ఎకాయెకిన 70.50 డాలర్ల నుంచి 78.50 డాలర్లకు పెరిగి, ఆరు నెలల గరిష్టానికి చేరింది. వారం రోజులుగా ఆ గరిష్ట స్థాయిలోనే తిరుగుతోంది.

యుద్ధం ఇదే విధంగా కొనసాగి, చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ని ఇరాన్ గానీ మూసివేస్తే ముడి చమురు రేట్లు 120-130 డాలర్ల వరకు కూడా ఎగిసే అవకాశం ఉందని అంచనాలు నెలకొన్నాయి. ఒకవేళ అదే జరిగితే, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లకూ రెక్కలు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశం ఇరాన్ నుండి నేరుగా చమురు దిగుమతి చేసుకోకపోయినా, మధ్యప్రాచ్య స్థిరత్వం ప్రభావం భారతీయ మార్కెట్‌పై పడుతుంది.

పర్షియన్ గల్ఫ్ ను గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంతో కలుపుతూ హర్మూజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా కేంద్రాలలో ఒకటిగా ఉంది. ఇది ఇరాన్, ఒమన్ మధ్య ఇరుకైన జలమార్గం. పర్షియన్ గల్ఫ్ నుండి ముడి చమురు ఎగుమతుల్లో 85% కంటే ఎక్కువ దీని ద్వారా వెళుతుంది. 2024లో ఈ జలసంధి రోజుకు సగటున 20 మిలియన్ బ్యారెల్స్ ప్రవాహాన్ని చూసింది. ఇది ప్రపంచ పెట్రోలియం వినియోగంలో ఐదవ వంతు.

ఇరాన్ ఈ జలసంధిని అడ్డుకోవడం గానీ, ఏదైనా అంతరాయం జరిగితే చమురు కొరత తీవ్రమై ధరల పెరుగుదలకు దారితీస్తుంది. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఈ మార్గం గుండా వెళ్ళే చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అంతరాయాల వల్ల ఈ దేశాలు ఏదైనా ఎక్కువగా ప్రభావితమవుతాయి.

# బీఎస్ఎన్ఎల్ కొత్త సర్వీస్..

BSNL

ప్రభుత్వ రంగ టెలికాం ఆపరేటర్ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సరికొత్త 5జీ ఇంటర్నెట్ సర్వీస్‌ను ప్రారంభించింది. దేశంలోనే తొలిసారి క్యూ5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ లాంచ్ చేసింది. ఇది సంస్థలకు, కార్యాలయాలకు సిమ్ రహిత, వైర్‌లెస్ పరిష్కారాన్ని అందిస్తుందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది.

**ఏమిటీ క్యూ-5జీ?**

క్యూ5జీ.. ఇక్కడ క్యూ అంటే క్వాంటమ్. ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ చాలా అరుదుగా ఉండే టైర్2, టైర్3 నగరాలను లక్ష్యంగా చేసుకుని బీఎస్ఎన్ఎల్ కొత్త క్యూ5జీ ఎఫ్‌డబ్ల్యూఏ సేవలను ప్రారంభించింది. భారతదేశంలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బీఎస్ఎన్ఎల్ రూపొందించిన ఈ సరికొత్త సర్వీస్ వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, నెట్వర్క్ లేని నివాస ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడంలో సహాయపడుతుంది.

అయితే, ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా అందించే సాధారణ 5జీ సేవల మాదిరిగా కాకుండా బీఎస్ఎన్ఎల్ క్యూ 5జీ ఎఫ్‌డబ్ల్యూఏలో వాయిస్ సదుపాయం ఉండదు. అంటే దీని ద్వారా వినియోగదారులు కాల్స్ చేయలేరు. సిమ్ లేదా వైర్లు లేకుండా వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే ఎయిర్టెల్ ఎక్స్‌ట్రీమ్ ఫైబర్, జియో ఎయిర్ ఫైబర్ మాదిరిగానే ఇది ఉంటుంది.

**క్యూ-5జీ ప్లాన్‌లు**

మిగిలిన వైర్‌లెస్ ఇంటర్నెట్ సర్వీసుల మాదిరిగానే బీఎస్ఎన్ఎల్ క్యూ 5జీ తీసుకున్న కస్టమర్లకు వారి ఇళ్లపై సీపీఈ పరికరాలను ఏర్పాటు చేస్తారు. బీఎస్ఎన్ఎల్ కొత్త క్యూ5జీ సర్వీస్ 100 ఎంబీపీఎస్ కనీస వేగాన్ని అందిస్తుంది. ఇందుకోసం నెలకు రూ.999 ఖర్చు అవుతుంది. అదే 300 ఎంబీపీఎస్ వేగం కావాలంటే రూ.1,499 ప్లాన్ ను అందిస్తోంది.




ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ క్యూ5జీ ఎఫ్‌డబ్ల్యూఏ హైదరాబాద్‌కే పరిమితం కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి బెంగళూరు, పాండిచ్చేరి, విశాఖపట్నం, పుణె, గ్వాలియర్, చండీగఢ్ వంటి నగరాలకు ఈ సేవలను విస్తరించాలని యోచిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే తెలిపింది.

# రెండోసారి గర్భం దాల్చిన హీరోయిన్.. నిజమేనా?



బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ మరోసారి గర్భం దాల్చిందని కొన్ని వారాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ఆలియా హాజరైనప్పటి నుంచి ఈ రూమర్స్ మొదలయ్యాయి. పైగా జిమ్‌కు వెళ్లినప్పుడు కూడా కెమెరాలు కనిపించగానే ఎవరినీ పలకరించకుండా హడావుడిగా వెళ్లి కారులో కూర్చునేది. దీంతో నిజంగానే ఆలియా ప్రెగ్నెంట్ అయిందేమోనన్న అనుమానాలు వెలువత్తాయి.


**డ్యాన్స్ రిహార్సల్స్..**

కానీ, హీరోయిన్ లేటెస్ట్ వీడియోతో ఇవన్నీ వుట్టి పుకార్లేనని తేలిపోయాయి. ఆల్ఫా సినిమా కోసం డ్యాన్స్ రిహార్సల్స్ చేసిన ఆలియా తాపీగా వెళ్లి కారెక్కింది. మధ్యలో అక్కడున్నవారిని కూడా పలకరించింది. పైగా తనకు పొట్ట కూడా లేకపోవడంతో సెకండ్ ప్రెగ్నెన్సీ అంటూ వస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని తేలిపోయింది.

**రాహా మూడో బర్త్‌డే..**

ఆలియా భట్ - రణ్‌బీర్ కపూర్ 2022లో పెళ్లి చేసుకున్నారు. అదే ఏడాది కూతురు రాహా జన్మించింది. ఈ ఏడాది రాహా మూడో బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోనుంది. సినిమాల విషయానికి వస్తే ఆలియా ప్రస్తుతం 'ఆల్ఫా' మూవీ చేస్తోంది. 'ముంజ్య' హీరోయిన్ శార్వరితో కలిసి నటిస్తున్న ఈ మూవీ క్రిస్మస్‌కు విడుదల కానుంది.

# 20 రోజుల్లోనే ఓటీటీలోకి వచ్చేసింది




రీసెంట్ టైంలో కొత్త సినిమాలు ఓటీటీల్లోకి అనుకున్న దానికంటే త్వరగానే వచ్చేస్తున్నాయి. కొన్ని చిన్న బడ్జెట్ చిత్రాలైతే మరీ రెండు మూడు వారాలకే స్ట్రీమింగ్ అవుతున్నాయి. ఇప్పుడు కూడా ఓ తెలుగు మూవీ ఇలానే ప్రేక్షకుల ముందుకొచ్చేసింది. 'రాజాసాబ్' దర్శకుడు మారుతి దీన్ని సమర్పించడం విశేషం. ఇంతకీ ఏంటా సినిమా? ఎందులో ప్రస్తుతం అందుబాటులో ఉంది?

'ఉయ్యాలా జంపాలా', 'బాహుబలి' తదితర సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన నిఖిల్ దేవాదుల ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'ఘటికాచలం'. నిజ జీవితంలో జరిగిన సంఘటనల్ని తీసుకుని సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అమర్ కామెపల్లి దర్శకత్వం వహించగా.. నిఖిల్‌తో పాటు ప్రభాకర్, ఆర్వికా గుప్తా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పుడు ఈ మూవీ రెండు ఓటీటీల్లోకి ఎలాంటి హడావుడి లేకుండా వచ్చేసింది. మే 31న థియేటర్లలో రిలీజైన ఈ సినిమా.. ఇప్పుడు 20 రోజులకే అమెజాన్ ప్రైమ్, ఆహా ఓటీటీల్లోకి వచ్చేసింది. తెలుగులోనే స్ట్రీమింగ్ అవుతోంది. హారర్ అంశాలు బాగున్నప్పటికీ చిన్న సినిమా కావడంతో జనాలకు పెద్దగా రీచ్ కాలేదు. ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది కాబట్టి ఆసక్తి ఉన్నవాళ్లు చూస్తారేమో? ఘటికాచలం విషయానికొస్తే.. తండ్రి కోరిక మేరకు మెడిసన్ చదివే ఓ కుర్రాడికి భయంకరమైన గొంతు వినిపిస్తూ ఉంటుంది. దీంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తాడు. ఇంతకీ అలా చేయడానికి కారణమేంటి? ఆ గొంతు ఎవరిది? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.




# 'రాజాసాబ్' సినిమా టీజర్ విజువల్స్ చోరీ

**పోలీసులకు ఫిర్యాదు**

**బంజారాహిల్స్:** ప్రముఖ నటుడు ప్రభాస్ హీరోగా నటించిన రాజాసాబ్ సినిమా టీజర్ విజువల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ డబ్బింగ్ స్టూడియో ఇన్‌చార్జి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని సాగర్ సొసైటీలో ఉన్న వారాహి స్టూడియోలో రాజాసాబ్ సినిమాకు సంబంధించి విజువల్స్ భద్రపరిచారు. అయితే ఈ నెల 11వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు స్టూడియోలోకి ప్రవేశించి ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విజువల్స్‌ను చోరీ చేశారని, 13వ తేదీన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని డబ్బింగ్ ఇన్‌చార్జి ఎన్.వసంత్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను ఫేస్‌బుక్‌లో శంకర్‌బాయి, కార్తీక్ ప్రభాస్ పేరుతో, ఇన్‌స్టాలో ప్రభాస్ ఆర్మీ ఫ్యాన్ పేరుతో పోస్ట్ చేశారని, తాము అధికారికంగా విడుదల చేయాల్సిన టీజర్‌కు ముందే చోరీ చేసిన ఈ టీజర్ విజువల్స్‌ను పోస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. ఫుటేజీలు పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.



# హైదరాబాద్‌లో వారణాసి!

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ అంతర్జాతీయ స్థాయి సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలైందని సమాచారం. ఈ షెడ్యూల్ కోసం మేకర్స్ హైదరాబాద్ శివార్లలో భారీ సెట్‌స్‌ను క్రియేట్ చేశారని తెలిసిందే.

ఇందులో భాగంగా వారణాసి నగరాన్ని తలపించేలా భారీ సెట్స్ వేశారని భోగట్టా. ఈ సెట్‌స్‌కు రూ. 40 కోట్లకు పైనే అయ్యిందని టాక్. అంతేకాదు... ఈ సినిమాలోని మేజర్ సన్నివేశాల చిత్రీకరణ ఈ సెట్‌స్‌లోనే జరుగుతుందని, అందుకే ఈ స్థాయిలో ఖర్చుపెట్టారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత టీమ్ ఫారిన్‌కి వెళుతుందని, అక్కడి ఫారెస్ట్ లొకేషన్స్‌లో యాక్షన్ సీక్వెన్స్‌లను లాన్ చేశారనే టాక్ వినిపిస్తోంది.



# అమ్మ బర్త్ డే.. ఐకాన్ స్టార్ స్పెషల్ పోస్ట్!

గతేడాది పుష్ప-2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన అల్లు అర్జున్.. ప్రస్తుతం అట్లీతో జతకట్టారు. తొలిసారి వీరిద్దరి కాంబోలో రానున్న మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీలో బన్నీ సరసన బాలీవుడ్ భామ దీపికా పదుకొణె కనిపించనుంది. ఇటీవలే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ మూవీ షూటింగ్ త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. అయితే తాజాగా ఇవాళ తన తల్లి బర్త్ డే సందర్భంగా ఐకాన్ స్టార్ స్పెషల్ ఫోటోను పంచుకున్నారు. అమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఫోటోను షేర్ చేశారు. హ్యాపీ బర్త్ డే మామ్ అంటూ బన్నీ పోస్ట్ చేశారు. ఇది చూసిన అభిమానులు సైతం నిర్మలమ్మకు బర్త్ డే విషెస్ చెబుతున్నారు.

**అవార్డుల అల్లు అర్జున్..**

పుష్ప-2 సినిమాకు గానూ 'అల్లు అర్జున్' ఉత్తమ నటుడిగా 'గద్దర్' అవార్డు అందుకున్నారు. ఉత్తమ నటుడిగా గద్దర్ తొలి అవార్డ్ అందుకుని చరిత్ర పుటల్లోకి అల్లు అర్జున్ పేరు చేరింది. అదే విధంగా 69వ జాతీయ అవార్డుల్లో కూడా తెలుగు సినిమా సత్తా చాటింది. అక్కడ కూడా ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ (పుష్ప) నిలిచారు. ఎందుకంటే 69 ఏళ్ల సినీ చరిత్రలో ఓ తెలుగు నటుడికి జాతీయ అవార్డ్ రావడం ఇదే ఫస్ట్ టైమ్. కాగా.. బన్నీ ఇప్పటి వరకు నటించిన సినిమాలు 21.. అయితే ఉత్తమ నటుడిగా 11సార్లు నామినేట్ అయ్యాడు. ఏడు చిత్రాలకు గాను ఉత్తమ నటుడిగా అత్యుత్తమ అవార్డ్స్ అందుకున్నాడు. మొత్తంగా దేశంలో పేరు పొందిన 18 అవార్డ్స్‌ను ఆయన సొంతం చేసుకున్నాడు.

# మోహన్ లాల్ దృశ్యం3.. రిలీజ్ ఎప్పుడంటే?



దృశ్యం సినిమా సిరీస్‌కు ఆడియన్స్‌లో అద్భుతమైన క్రేజ్ ఉంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు పార్టులు విడుదలై అభిమానులను అలరించాయి. మలయాళంలో వచ్చిన ఈ సినిమాను అటు తెలుగులో.. ఇటు బాలీవుడ్‌లోనూ రిలీజ్ చేయగా సూపర్‌హిట్‌గా నిలిచాయి. ఇప్పటికే ఈ సూపర్ హిట్ మూవీ సిరీస్‌లో దృశ్యం3 కూడా అనౌన్స్ చేశారు మేకర్స్. అయితే తాజాగా దృశ్యం3 రిలీజ్ ఎప్పుడనేది కూడా మేకర్స్ తాజాగా రివీల్ చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో థియేటర్లలో విడుదల కానుందనిప్రకటించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు.

దృశ్యం మూవీపై మోహన్ లాల్ మాట్లాడుతూ.. 'దృశ్యం సినిమా మలయాళ పరిశ్రమకు గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో మేము ఆ చిత్రాన్ని నిర్మించాం. ఆ చిత్రాన్ని భారతదేశమంతా వీక్షించింది. ఇప్పుడు ఇండియా వ్యాప్తంగా మలయాళ పరిశ్రమ గురించి తెలుసు. దృశ్యం తర్వాత మరిన్ని మలయాళ చిత్రాలను చూడటం ప్రారంభించారు. ఇది మా పరిశ్రమకు, అంతర్జాతీయంగా కూడా ఒక వరంలా మారింది." అని సంతోషం వ్యక్తం చేశారు.'దృశ్యం సూపర్ హిట్ తర్వాత హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, సింహళీ, చైనీస్ భాషలలో కూడా రీమేక్ చేశారు. మరోవైపు బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో 'దృశ్యం 3' హిందీ వర్షన్ సైతం అక్టోబర్‌లో సెట్స్ పైకి వెళ్లనుందని టాక్ వినిపిస్తోంది. దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. మలయాళ సినిమాను రీమేక్ చేస్తారా? లేదంటే సొంతగా కథను తెరకెక్కిస్తారా అనేది తెలియాల్సి ఉంది. తొలి రెండు భాగాలు మలయాళం నుంచి రీమేక్ చేసిన సంగతి తెలిసిందే.



## కజకిస్తాన్ ప్లేయర్ బుబ్లిక్ సంచలనం

**హాలె (జర్మనీ):** హాలె ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. కజకిస్తాన్‌కు చెందిన ప్రపంచ 45వ ర్యాంకర్ అలెగ్జాండర్ బుబ్లిక్ అద్భుత ఆటతీరుతో సినెర్‌ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకున్నాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బుబ్లిక్ 3-6, 6-3, 6-4తో టాప్ సీడ్ సినెర్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 2 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 6 అడుగుల 5 అంగుళాల ఎత్తు, 82 కేజీల బరువున్న బుబ్లిక్ 15 ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన బుబ్లిక్ ప్రత్యర్థి సరోవీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన సినెర్ ఈ మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 30 విన్నర్స్ కొట్టిన ఈ ఇటాలియన్ ప్లేయర్ 25 అనవసర తప్పిదాలు చేశాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది సినెర్ మూడు మ్యాచ్‌ల్లోనే ఓడిపోయాడు. అల్‌కరాజ్‌తో జరిగిన రోమ్ ఓపెన్ మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడిన సినెర్ తాజాగా బుబ్లిక్ చేతిలో ఓడిపోయాడు. సినెర్‌ను ఓడించిన ఉత్సాహంలో బుబ్లిక్ హాలె ఓపెన్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో బుబ్లిక్ 7-6 (7/2), 6-3తో ప్రపంచ 23వ ర్యాంకర్, ఏడో సీడ్ టామస్ మఖాచ్ (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు.



## జస్ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత.. ఫస్ట్ ఓవర్ కింగ్‌గా

టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో 2021 నుంచి తొలి ఓవర్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఓవర్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీని ఔట్ చేసిన బుమ్రా.. ఈ రేర్ ఫీట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. 2021 నుంచి బుమ్రా ఇప్పటివరకు తొలి ఓవర్‌లో 8 వికెట్లు పడగొట్టాడు. ఇంతకుముందు ఈ రికార్డు సౌతాఫ్రికా స్పీడ్ స్టార్, ఆసీస్ ప్రీమియర్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ పేరిట సంయుక్తంగా ఉండేది. వీరిద్దరూ తొలి ఓవర్‌లో 7 వికెట్లు పడగొట్టారు. తాజా మ్యాచ్‌తో ఈ ఇద్దరి పేసర్లను బుమ్రా అధిగమించాడు.

**ఇంగ్లండ్ ఓపెనర్ మైండ్ బ్లాంక్..**

కాగా బుమ్రా తొలి ఓవర్‌లోనే క్రాలీని బోల్తా కొట్టించాడు. మొదటి ఓవర్‌లో ఐదో బంతిని బుమ్రా.. క్రాలీకి మిడిల్ స్టంప్‌పై అవుట్‌స్వింగర్ వేశాడు. క్రాలీ ఆ బంతిని లెగ్‌సైడ్ ఆడటానికి ప్రయత్నించాడు. కానీ బంతి అవుట్‌సైడ్ ఎడ్జ్ తీసుకుని ఫస్ట్ స్లిప్‌లో కరుణ్ నాయర్ చేతుల్లోకి వెళ్లింది. దీంతో 4 పరుగులు చేసిన ఇంగ్లండ్ ఓపెనర్ నిరాశతో పెవిలియన్‌కు చేరాడు.

**ధీటుగా బదులిస్తున్న ఇంగ్లండ్..**

ఇక ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగులకు ఆలౌటైంది. 359/3 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ఆరంభించిన టీమిండియా అదనంగా 112 పరుగులు జోడించి తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. భారత బ్యాటర్లలో రిషబ్ పంత్‌తో పాటు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (147, 227 బంతుల్లో 19 ఫోర్లు, 1 సిక్స్), యశస్వి జైస్వాల్ (101, 159 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగారు.

ఇంగ్లండ్ బౌలర్లలో కెప్టెన్ బెన్‌స్టోక్స్, జోష్‌టంగ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. బ్రైడాన్ కార్స్, షోయక్ బషీర్ చెరో వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లు ముగిసే సరికి రెండు వికెట్ నష్టానికి 126 పరుగులు చేసింది. రెండు వికెట్లు కూడా బుమ్రానే పడగొట్టాడు.



## హారికకు మూడో స్థానం

**సెయింట్ లూయిస్ (అమెరికా):** కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక మూడో స్థానాన్ని దక్కించుకుంది. మరోవైపు భారత నంబర్‌వన్, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన స్టార్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి వరుసగా మూడో ఓటమి చవిచూసి ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. అలీనా కషిన్‌స్కాయ (పోలాండ్)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను హారిక 38 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించి 5 పాయింట్లతో మూడో స్థానాన్ని ఖరారు చేసుకుంది. గత ఏడాది కూడా మూడో స్థానంలో నిలిచిన హారిక ఈ ఏడాది టోర్నీలో కేవలం కోనేరు హంపి చేతిలో ఓడిపోయి... మిగతా ఎనిమిది గేముల్లో రెండింటిలో గెలిచి, ఆరింటిని 'డ్రా' చేసుకుంది.

ఆరో రౌండ్ తర్వాత అగ్రస్థానంలో నిలిచిన హంపి వరుసగా మూడు గేముల్లో ఓడిపోయి 4.5 పాయింట్లతో ఐదో స్థానాన్ని పొందింది. ఏడో రౌండ్‌లో కరిసా యిప్ (అమెరికా) చేతిలో, ఎనిమిదో రౌండ్‌లో నినో బత్సియాష్విలి (జార్జియా) చేతిలో ఓడిన హంపి 46 ఎత్తుల్లో మరియా ముజీచుక్ (ఉక్రెయిన్) చేతిలో పరాజయం పాలైంది. హంపితోపాటు నానా జాగ్‌నిడ్జె (జార్జియా), బీబీసారా అసబయేవా (కజకిస్తాన్), అలీషా 4.5 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచారు.

మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... నానా జాగ్‌నిడ్జె నాలుగో స్థానంలో, హంపి ఐదో స్థానంలో, బీబీసారా ఆరో స్థానంలో, అలీషా ఏడో స్థానంలో నిలిచారు. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్‌లపాటు ఈ టోర్నీని నిర్వహించగా... 6 పాయింట్లతో కరిసా యిప్ (అమెరికా) చాంపియన్‌గా అవతరించింది. 5.5 పాయింట్లతో అలైస్ లీ (అమెరికా) రన్నరప్‌గా నిలిచింది. విజేత కరిసా యిప్‌నకు 60 వేల డాలర్లు (రూ. 51 లక్షల 96 వేలు), రన్నరప్ అలైస్ లీకి 50 వేల డాలర్లు (రూ. 43 లక్షల 30 వేలు), మూడో స్థానంలో నిలిచిన హారికకు 40 వేల డాలర్లు (రూ. 34 లక్షల 64 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.







# గిల్, జైశ్వాల్, పంత్ సెంచరీలు.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోర్

**లీడ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు జూలు విదిల్చారు.**

మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియా 471 పరుగుల భారీ స్కోర్ సాధించింది. 359/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన గిల్ సేన. అదనంగా 112 పరుగులు జోడించి తమ ఇన్నింగ్స్‌ను ముగించింది.

రెండో రోజు ఆటలో టీమిండియా బ్యాటర్లు మెరుగ్గా రాణించలేకపోయారు. భారత బ్యాటర్లలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (147, 227 బంతుల్లో 19 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (134, 178 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (101 159 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగారు.

**సుదర్శన్, కరుణ్ నాయర్ అట్టర్ ఫ్లాప్..**

ఇక ఈ మ్యాచ్‌లో భారత తరపున అరంగేట్రం చేసిన సాయిసుదర్శన్ తీవ్ర నిరాశపరిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. అతడితో పాటు తొమ్మిదేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ సైతం ఖాతా తెరవకుండా పెవిలియన్‌కు చేరాడు. ఇంగ్లండ్ బౌలర్లలో కెప్టెన్ బెన్‌స్టోక్స్, జోష్ టంగ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. బ్రైడాన్ కార్స్, షోయక్ బషీర్ చెరో వికెట్ సాధించారు.

## ఆరోజు ముగ్గురం సెంచరీలు చేశామన్న సచిన్.. గంగూలీ రిప్లై ఇదే

ఇంగ్లండ్ తో టెస్టు సిరీస్ ప్రయాణంలో టీమిండియా శుభారంభం అందుకుంది. లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో.. శుక్రవారం మొదలైన తొలి టెస్టు మొదటి రోజు ఆటలోనే పటిష్ట స్థితిలో నిలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన గిల్ సేన.. 85 ఓవర్ల ఆటలో మూడు వికెట్ల నష్టానికి మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 359 పరుగులు సాధించి పట్టు బిగించింది.

ఓపెనర్లలో కేఎల్ రాహుల్ (42) రాణించగా.. యశస్వి జైస్వాల్ (101) శతకంతో చెలరేగాడు. ఇక టీమిండియా టెస్టు సారథిగా తొలి మ్యాచ్‌లో శుబ్‌మన్ గిల్ కూడా అద్భుత సెంచరీతో మెరిశాడు. శుక్రవారం నాటి ఆట ముగిసే సరికి గిల్ 127 పరుగులతో క్రీజులో ఉండగా.. వైస్ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ 65 పరుగులతో అతడికి తోడుగా ఉన్నాడు.

ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌లో మొదటి టెస్టులో తొలి రోజు టీమిండియా ప్రదర్శనపై బ్యాటింగ్ దిగ్గజం



సచిన్ టెండుల్కర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. కేఎల్ రాహుల్, జైస్వాల్, గిల్, పంత్‌లను ప్రశంసిస్తూ ట్వీట్ చేశాడు.

"కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ భారత ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. ఇక అద్భుతమైన శతకాలు బాదిన జైస్వాల్, శుబ్‌మన్ గిల్‌లకు శుభాకాంక్షలు. రిషభ్ పంత్ కూడా వీరితో సమానంగా తన వంతు పని పూర్తి చేశాడు.

ఈరోజు టీమిండియా బ్యాటింగ్‌ను చూస్తుంటే.. నాకు 2002లో హెడింగ్లీలో.. రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, నేను తొలి ఇన్నింగ్స్‌లో శతకాలు బాదడం గుర్తుకువచ్చింది. ఆ టెస్టులో మేము గెలిచాము.

ఈరోజు.. యశస్వి, శుబ్‌మన్ తమ పని పూర్తి చేశారు. ఇక మూడో సెంచూరియన్ ఎవరు అవుతారో చూడాలి" అని సచిన్ టెండుల్కర్ పేర్కొన్నాడు. ఇందుకు టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ స్పందిస్తూ.. "హాయ్ చాంప్.. ఈసారి నలుగురు సెంచరీలు చేస్తారేమో.. పిచ్ బాగుంది.. పంత్.. కరుణ్ కూడా శతకాలు బాదుతారేమో!

అయితే, 2002 నాడు తొలి రోజు పిచ్ స్వభావానికి ఇప్పటి వికెట్‌కు కాస్త తేడా ఉంది" అని బదులిచ్చాడు. కాగా 2002లో ఇదే వేదికపై సచిన్ టెండుల్కర్ గంగూలీతో కలిసి 249 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇక టెండుల్కర్ 303 బంతుల్లో 193 పరుగులు సాధించగా.. గంగూలీ 128 రన్స్ స్కోరు చేశాడు. అదే విధంగా.. 'వాల్' రాహుల్ ద్రవిడ్ 148 పరుగులు చేయగా.. అప్పటి ఓపెనర్ సంజయ్ బంగర్ 68 రన్స్ రాబట్టాడు.

కాగా ఇప్పటి వరకు ఇంగ్లండ్ టీమిండియా మధ్య టెస్టు సిరీస్‌ను పటౌడీ ట్రోఫీగా పిలిచేవారు. తాజాగా దీనికి టెండుల్కర్‌ఆండర్సన్ ట్రోఫీగా నామకరణం చేశారు. ఇక దఫా పర్యటనలో భారత్ ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లో తలపడనుంది.

దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి, స్పిన్ లెజెండ్ రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ టెస్టులకు గుడ్‌బై చెప్పిన తర్వాత.. టీమిండియా ఆడుతున్న తొలి సిరీస్ ఇదే. రోహిత్ స్థానంలో టెస్టు జట్టు కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్‌కు ఈ సిరీస్ ప్రతిష్టాత్మకంగా మారింది.

## ఎనిమిదేళ్ల తర్వాత ఛాన్స్.. కట్ చేస్తే! రీఎంట్రీ మ్యాచ్‌లో డకౌట్



**టీమిండియా వెటరన్ ఆటగాడు కరుణ్ నాయర్ తన రీ ఎంట్రీలో తీవ్రనిరాశపరిచాడు.**

ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టులోకి తిరిగొచ్చిన.. కరుణ్ నాయర్‌కు తన లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. లీడ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో కరుణ్ డకౌటయ్యాడు.

మొదటి ఇన్నింగ్స్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నాయర్ నాలుగు బంతులు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఓలీ పోప్ సంచలన క్యాచ్ అందుకోవడంతో నాయర్ డకౌట్ అవ్వాల్సి వచ్చింది. అంతకుముందు అరంగేట్ర ఆటగాడు సాయిసుదర్శన్ కూడా తన ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు.

**టీమిండియా@471**

ఇక మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియా 471 పరుగుల భారీ స్కోర్ సాధించింది. 359/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన గిల్ సేన. అదనంగా 112 పరుగులు జోడించి తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. భారత బ్యాటర్లలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (147, 227 బంతుల్లో 19 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (134, 178 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (101 159 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగారు. ఇంగ్లండ్ బౌలర్లలో కెప్టెన్ బెన్‌స్టోక్స్, జోష్‌టంగ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. బ్రైడాన్ కార్స్, షోయక్ బషీర్ చెరో వికెట్ సాధించారు.